RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం


జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 249 | సంపుటి 4 | ఆదివారం | 31-05-2026 | పేజీలు 4 | వెల 3/-




## మోటార్లకు మీటర్లు పెడితే

# ఎన్నికల్లో పోటీ చేయం

**ఉచిత విద్యుత్ నిలిపివేస్తే ప్రజల ముందుకు రామంటూ స్పష్టీకరణ**

**ఉచిత కరెంట్ కొనసాగితే బీఆర్ ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సవాల్**

- రైతు డిస్కంతో 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని వెల్లడి
- కేసీఆర్ రైతుల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
- హరీశ్ రావు బీఆర్ ఎస్ లోనే ఉంటానని ఒట్టు వేసి చెప్పాలని డిమాండ్
- బీజేపీ-బీఆర్ ఎస్ మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపణ
- సీబీఐ దర్యాప్తులపై కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్
- వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ దే విజయమని ధీమా
- కేంద్రం తెలంగాణ ధాన్యంలో 32 శాతం మాత్రమే కొనుగోలు చేస్తోందని విమర్శ
- ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో ముడిపెట్టడం సరికాదన్న సీఎం
- సెంటిమెంట్లు కాదు.. అభివృద్ధే లక్ష్యమని స్పష్టం

2

రైతుల మోటార్లకు మీటర్లు అమర్చినా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ను నిలిపివేసినా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయదని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల విషయంలో తమ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని, 24 గంటల ఉచిత విద్యుత్ అందించడంలో వెనుకడుగు వేయబోదని తేల్చిచెప్పారు. ఉచిత విద్యుత్ కొనసాగితే బీఆర్ఎస్ ఎన్నికల్లో పోటీ చేయదని ప్రకటించే ధైర్యం మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావుకు ఉందా అంటూ సవాల్ విసిరారు. రైతుల పేరుతో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్న బీఆర్ ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేకంగా రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నామని, దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఈ వ్యవస్థ అమల్లోకి రానుందని వెల్లడించారు. అదే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులు, ధాన్యం కొనుగోళ్లు, సీబీఐ దర్యాప్తులు, బీజేపీ-బీఆర్ఎస్ సంబంధాలు, అంతర్రాష్ట్ర జల వివాదాలు, హరీశ్ రావు రాజకీయ భవిష్యత్, కేటీఆర్ పై ఆరోపణలు, ఎన్టీఆర్ పేరుతో జరుగుతున్న రాజకీయాలపై కూడా సీఎం ఘాటుగా స్పందించారు. ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా సమాధానమిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, రైతు సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్న ఆయన, రానున్న ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. — ప్రభాత గమనం, హైదరాబాద్



## మండుటెండల్లో 'ఉపాధి' పనులు

- మండుటెండల్లో పనిచేస్తున్న కూలీలు
- కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం
- నిబంధనల ప్రకారం ఉండాల్సిన టెంట్లు, మెడికల్ కిట్లు గల్లంతు
- రోజుకు రెండుసార్లు ఫోటో క్యాప్చరింగ్ తో పనులకు అంతరాయం
- పట్టించుకోని అధికారుల తీరుపై కార్మికుల ఆగ్రహం
- తక్షణమే తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని కూలీల డిమాండ్

3

## అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

గీసుకొండ మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర జిల్లాకు సంబంధించిన సుర రవి మహబూబాబాద్ కు చెందిన ఎండి ఇమ్రాన్ ని గీసుకొండ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూపాయలు 35 విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు గీసుకొండ సిఐ విశ్వేశ్వర్ తెలిపారు. సీఐ విశ్వేశ్వర్ కథనం ప్రకారం కొనయమాకుల ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఎస్సై అనిల్ కుమార్ వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని అదుపులోకి తీసుకున్నారు. రాంపూర్ ఎలుకతుర్తి శాయంపేట గొర్రెకుంట ప్రాంతంలో వ్యవసాయ మోటర్లు ఇనుప సామాగ్రి బైక్ చోరీ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. కరీంనగర్ వడ్డెర కాలనీకి చెందిన సుర రవి పై 24 దొంగతన కేసులు మహబూబాబాద్ సుక్కమ్మ బజార్కు చెందిన ఎండి ఇమ్రాన్ పై తొమ్మిది కేసులు ఉన్నాయి. వీరు వద్ద నుంచి స్పెండర్ బైక్స్ తొమ్మిది వేల రూపాయల నగదు ఐరన్ పైపులు బకెట్లు రాడ్లు బిందెలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన గీసుకొండ ఎస్సై అనిల్ కుమార్ ని మరియు సిబ్బందిని ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్ అభినందించారు.






### శ్రీరామగిరి వీఓ భవన

## నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం...

- రూ.10 లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న వీఓ భవనం
- బేస్ మెంట్ లో నల్లరాయికి బదులుగా సిమెంట్ ఇటుకల వినియోగం
- నాణ్యతా ప్రమాణాలకు తూట్లు..
- ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై విమర్శలు
- భవనం మన్నిక, భద్రతపై స్థానికుల ఆందోళన
- నిర్మాణ పనులపై ఉన్నతాధికారుల విచారణకు గ్రామస్తుల డిమాండ్

2

### మహబూబాబాద్‌లో అర్ధరాత్రి

## 'బుల్లెట్' హల్‌చల్



04


- సివిల్ డ్రస్ లో ఎస్పీ శబరీష్ తనిఖీలు!
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న సరికొత్త యాక్షన్ ప్లాన్
- గంజాయి, మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం
- యువత తప్పు చేస్తే కౌన్సిలింగ్.. నేరం రుజువైతే కఠిన శిక్షలు
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ శబరీష్ పిలుపు

### పేకాట స్థావరంపై

## టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడి

- రూ.31,440 నగదు, సెల్ ఫోన్లు, వాహనాలు స్వాధీనం
- 11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్..

— వివరాలు 2వ పేజీలో



# మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయం




- ఉచిత విద్యుత్ నిలిపివేస్తే ప్రజల ముందుకు రామంటూ స్పష్టీకరణ
- ఉచిత కరెంట్ కొనసాగితే బీఆర్ ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సవాల్
- రైతు డిస్కంతో 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని వెల్లడి
- కేసీఆర్ రైతుల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
- హరీశ్ రావు బీఆర్ ఎస్ లోనే ఉంటానని ఒట్టు వేసి చెప్పాలని డిమాండ్
- బీజేపీ-బీఆర్ ఎస్ మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపణ
- సీబీఐ దర్యాప్తులపై కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్
- వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ దే విజయమని ధీమా
- కేంద్రం తెలంగాణ ధాన్యంలో 32 శాతం మాత్రమే కొనుగోలు చేస్తోందని విమర్శ
- ఎన్టీఆర్ ను కులం, ప్రాంతంతో ముడిపెట్టడం సరికాదన్న సీఎం
- సెంటిమెంట్లు కాదు.. అభివృద్ధే లక్ష్యమని స్పష్టం

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

రైతుల మోటార్లకు మీటర్లు అమర్చినా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను నిలిపివేసినా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయదని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ వెనక్కి తగ్గదని పేర్కొన్న ఆయన, ఉచిత విద్యుత్ కొనసాగితే బీఆర్ఎస్ ఎన్నికల్లో పోటీ చేయబోదని ప్రకటించే ధైర్యం ఉందా అంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సవాల్ విసిరారు. రైతుల పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతోనే ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతు డిస్కం ద్వారా విద్యుత్ సరఫరాలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఈ వ్యవస్థను అమలు చేయబోతున్నామని వెల్లడించారు. రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ వినియోగాన్ని కూడా ఈ వ్యవస్థతో అనుసంధానం చేస్తున్నామని చెప్పారు.

### అప్పులపై ప్రతిపక్షాల విమర్శలు అవాస్తవం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను సీఎం ఖండించారు. తమ ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.70 వేల కోట్ల మేర అప్పులు చేస్తున్నప్పటికీ, గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న రూ.95 వేల కోట్ల అప్పులను కూడా తీర్చాల్సి వస్తోందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతిపక్ష నేతలు ప్రజలకు చెప్పడం లేదని ఆరోపించారు. రూ.54 వేల కోట్ల మేర అప్పులు తీసుకుంటామని ముందుగానే ప్రజలకు చెప్పామని, ఆ మేరకే ఆర్థిక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వివరించారు. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల పరిధిని దాటి అప్పులు చేసే అవకాశం లేదని స్పష్టం చేశారు.

### హరీశ్‌రావుపై సీఎం విమర్శలు

మాజీ మంత్రి టీ.హరీష్ రావుపై సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై ఒట్టు వేసి తాను జీవితాంతం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని హరీశ్‌రావు ప్రకటించాలని సవాల్ చేశారు. గతంలో కూడా హరీశ్‌రావు ఇతర పార్టీల నాయకులతో సంప్రదింపులు జరిపారని ఆరోపించారు. హరీశ్‌రావు ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు తెలుసని, అయితే ఆ విషయాలను బహిరంగంగా చెప్పనని అన్నారు. పార్టీ సమావేశాలను వదిలి ఢిల్లీకి ఎందుకు వెళ్లారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ అవగాహన ఉందనే అనుమానాలు రోజురోజుకు బలపడుతున్నాయని పేర్కొన్నారు.

### సీబీఐ దర్యాప్తుపై ప్రశ్నలు

కొన్ని అవినీతి కేసులకు సంబంధించి ప్రాథమిక ఆధారాలతో రెండు కేసులను సీబీఐకి అప్పగించామని సీఎం తెలిపారు. అయితే ఇప్పటి వరకు దర్యాప్తు ముందుకు సాగకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగుతానని మరోసారి స్పష్టం చేసిన సీఎం, ప్రజలు ఇచ్చిన బాధ్యతను పూర్తి స్థాయిలో నిర్వర్తిస్తానన్నారు.

### మహేశ్‌కుమార్ గౌడ్‌తో విజయవంతమైన కలయిక

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో తనది విజయవంతమైన రాజకీయ కలయిక అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తమ నాయకత్వంలో జరిగిన ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయాలు సాధించిందని గుర్తు చేశారు. రానున్న స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయపథంలోనే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహేశ్ కు కీలక బాధ్యతలు దక్కే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

### ధాన్యం కొనుగోళ్లపై కేంద్రంపై విమర్శలు

తెలంగాణలో పండుతున్న ధాన్యంలో కేవలం 32 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని సీఎం ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడంలో కేంద్రం విఫలమవుతోందని విమర్శించారు. అంతర్రాష్ట్ర జల వివాదాల పరిష్కారానికి ప్రధాని మోడీ సూచనలు చేస్తున్నారని, ఆ మేరకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రాణహిత ప్రాజెక్టు అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశం కావాలని కోరుతున్నప్పటికీ అపాయింట్‌మెంట్ లభించడం లేదని పేర్కొన్నారు.

### కేటీఆర్, బీఆర్ఎస్‌పై విమర్శలు

జవాబుపత్రాల తారుమారు వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్లోబరీనా సంస్థకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సంబంధాలున్నాయని సీఎం ఆరోపించారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

### ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో ముడిపెట్టడం సరికాదు

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ను కులం, ప్రాంతీయ భావాలతో పోల్చడం బుద్ధిలేని తనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని అన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేసిన కేంద్రం, తెలంగాణ ప్రయోజనాల కోసం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టింది తమ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.

### సెంటిమెంట్ రాజకీయాలు చేయం

వివాదాలు, ప్రాంతీయ భావోద్వేగాలు, కుల రాజకీయాలను రెచ్చగొట్టి లబ్ధి పొందే ఆలోచన తమకు లేదని సీఎం స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికలపై ప్రస్తుతం ఎలాంటి తొందర లేదని, పార్టీ సంస్థాగత బలోపేతంపైనే దృష్టి సారిస్తున్నామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడి

- రూ.31,440 నగదు, సెల్ ఫోన్లు, వాహనాల స్వాధీనం
- 11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్..

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

హనుమకొండలోని హంటర్ రోడ్ ప్రాంతంలోని లోటస్ రెసిడెన్సీలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించి 11 మందిని అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో ఏసీపీ మధుసూదన్ పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.31,440 నగదు, 11 సెల్‌ఫోన్లు, 5 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. లోటస్ రెసిడెన్సీలో అక్రమంగా సాగుతున్న జూద కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పట్టుబడ్డ నిందితులను తదుపరి విచారణ నిమిత్తం సుబేదారి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమ జూద కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఏసీబీ వలలో సైబర్ క్రైం ఇన్ స్పెక్టర్

**హైదరాబాద్ మే30(ప్రభాత గమనం):**




సైబర్ నేరాలను అరికట్టి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్ స్పెక్టర్ బతుల మహేందర్ అవినీతి రొంపిలో దిగి ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. ఒక సైబర్ ఫ్రాడ్ కేసులో ఫిర్యాదుదారుడి బంధుమిత్రులను ఇరికించకుండా ఉండేందుకు ఏకంగా తొమ్మిది లక్షల రూపాయలు డిమాండ్ చేసిన ఈ అధికారి, ఇప్పటికే ఐదు లక్షలు జేబులో వేసుకున్నాడు. మిగిలిన నాలుగు లక్షల కోసం బాధితుడిని తన కార్యాలయంలోనే బెదిరిస్తుండగా, పక్కా సమాచారంతో మాటువేసిన ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ బృందం అతడిని పట్టుకుంది. వెంటనే నిందితుడి నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు 13 లక్షల లెక్కచూపని నగదుతో పాటు పలు బంగారు ఆభరణాలు, ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టుకు తరలించేందుకు సిద్ధమయ్యారు.

# హైదరాబాద్‌లో 3 కొత్త రిజర్వాయర్లు..

- తాగునీటి కష్టాలకు చెక్..
- హర్షం వ్యక్తం చేస్తున్న రాజధాని ప్రజలు



**హైదరాబాద్, మే30 (ప్రభాత గమనం):**

హైదరాబాద్ పాతబస్తీ పరిధిలోని చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో తాగునీటి కష్టాల తీర్చేందుకు ప్రభుత్వం రూ.50 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దీని ద్వారా బండ్లగూడ పరిధిలోని పలు కాలనీలకు పైపులైన్ల ద్వారా నీటి సరఫరా పెరగనుంది. మరోవైపు.. నగరానికి నీరందించే సింగూరు జలాశయంలో నిల్వలు 5.477 టీఎంసీలకు పడిపోవడంతో జూన్ 1 నుంచి అత్యవసర పంపింగ్ చేపట్టేందుకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఏర్పాట్లను సమీక్షించారు. అయితే నాగార్జునసాగర్, ఎల్లంపల్లి, గండిపేట్ జలాశయాల్లో నిల్వలు మెరుగ్గా ఉండటం నగరవాసులకు ఊరటనిచ్చే అంశం.

# నకిలీ పత్తి విత్తనాల విక్రయ కేంద్రంపై పోలీసుల దాడి

- 28 కేజీల విత్తనాలు స్వాధీనం
- నిందితులను అదుపులోకి తీసుకొని వివరాలు వెల్లడించిన తొర్రూర్ డీఎస్పీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం టీక్యా తండాలో నకిలీ పత్తి విత్తనాల విక్రయం జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తొర్రూర్ పోలీసులు, సీసీఎస్ బృందం సంయుక్తంగా ప్రత్యేక దాడి నిర్వహించారు. ఈ దాడిలో 28 కేజీల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో టీక్యా తండాకు చెందిన జాటోత్ వెంకన్న నకిలీ పత్తి విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే అతనికి అతని అల్లుడు బర్మావత్ సోమన్న నకిలీ విత్తనాలను సరఫరా చేస్తు నకిలీ విత్తనాల విక్రయం ద్వారా అమాయక రైతులను మోసం చేస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు తేలడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులను మోసం చేసే నకిలీ విత్తనాల ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచామని పోలీసులు పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతర తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన తొర్రూర్ సీఐ, సీసీఎస్ సీఐతో పాటు పోలీసు సిబ్బందిని తొర్రూర్ డీఎస్పీ అభినందించారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ప్రభుత్వ అనుమతి పొందిన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలని, అనుమానాస్పదంగా కనిపించే విత్తనాల విక్రయాలపై వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.



# గార్లలో మూడు జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

- సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా టోర్నమెంట్ ప్రారంభం
- క్రీడాకారులను ఉత్సాహపరిచిన మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు

**గార్ల, మే 30 (ప్రభాత గమనం) :**

స్థానిక పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల బాస్కెట్బాల్ క్రీడా మైదానం శనివారం సాయంత్రం క్రీడా సందడితో ఉరకలెత్తింది. వేసవి క్రీడా శిబిరం (సమ్మర్ క్యాంప్) ముగింపును పురస్కరించుకుని.. ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి బాస్కెట్బాల్ పోటీలను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను మహబూబాబాద్ డివిజన్ డీఎస్పీ తిరుపతిరావు ముఖ్య అతిథిగా విచ్చేసి వైభవంగా ప్రారంభించారు.పోటీలను ప్రారంభించిన అనంతరం డీఎస్పీ తిరుపతిరావు క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడల్లో గెలుపోటముల కంటే కూడా భాగస్వామ్యం వహించడమే అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు."విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి. నిరంతర సాధన, కఠిన శిక్షణ ద్వారానే క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరు. క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక ఉల్లాసానికి, క్రమశిక్షణకు తోడ్పడతాయి."ఇదే సందర్భంలో ఆయన విద్యార్థులకు నైతిక విలువలను బోధిస్తూ.. 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ' అనే సంస్కృతిని కాపాడుకుంటూ పెద్దలను గౌరవించాలని సూచించారు. ఈ సందర్భంగా తన గురువు రవీందర్ అందించిన ప్రోత్సాహాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు.అంతకుముందు డీఎస్పీ మైదానంలోకి చేరుకుని మూడు జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారిని అభినందించారు. అనంతరం బాస్కెట్బాల్‌ను నెట్‌లోకి వేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో మూడు జిల్లాల నుంచి వచ్చిన అత్యుత్తమ జట్లు తలపడుతుండటంతో మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బానోత్ పార్వతి హాతిరాం నాయక్, పాఠశాల హెచ్ఎం శీలంశెట్టి వెంకటేశ్వర్లు కూడా మాట్లాడి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ క్రీడా మహోత్సవంలో గార్ల-బయ్యారం సీఐ రవీందర్ యాదవ్, గార్ల ఎస్సై బి. సాయికుమార్, గార్ల మండల బాస్కెట్బాల్ ఫౌండర్ రామన్న గౌడ్, జిల్లా క్రీడల విభాగం బాధ్యురాలు జ్యోతి, టోర్నమెంట్ నిర్వాహకులు సూత్రపు జయశంకర్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రెఫరీలు, క్రీడాకారులు మరియు స్థానిక క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శ్రీరామగిరి వీఓ భవన నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం...

- రూ.10 లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న వీఓ భవనం
- బేస్ మెంట్ లో నల్లరాయికి బదులుగా సిమెంట్ ఇటుకల వినియోగం
- నాణ్యతా ప్రమాణాలకు తూట్లు..
- ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై విమర్శలు
- భవనం మన్నిక, భద్రతపై స్థానికుల ఆందోళన
- నిర్మాణ పనులపై ఉన్నతాధికారుల విచారణకు గ్రామస్తుల డిమాండ్

**నెల్లికుదురు, మే 30 (ప్రభాత గమనం):**

మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో నిర్మాణంలో ఉన్న విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ) భవన పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం చోటుచేసుకుంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సుమారు రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినప్పటికీ, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా విస్మరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణంలో నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. బేస్‌మెంట్ నిర్మాణంలో ఉపయోగించాల్సిన నల్లరాయి కాంక్రీట్‌కు బదులుగా సిమెంట్ ఇటుకలను వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో భవనం నాణ్యత దెబ్బతినడంతో పాటు దీర్ఘకాలిక మన్నికపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ పనుల్లో నాసిరకం మెటీరియల్ వినియోగించడం వల్ల భవిష్యత్తులో భవన భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ధనంతో చేపడుతున్న పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వకుండా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పనుల్లో జరిగిన లోపాలను గుర్తించి, నాణ్యమైన మెటీరియల్‌తో భవన నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# వడదెబ్బతో వ్యక్తి మృతి

- శ్రీరామగిరిలో విషాదం
- ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

**నెల్లికుదురు మే30(ప్రభాత గమనం):**



నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన చదల ధర్మయ్య వడదెబ్బ కారణంగా మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. ఇటీవల జిల్లాలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలుల ప్రభావాన్ని తట్టుకోలేక ధర్మయ్య అనారోగ్యానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొద్ది రోజులుగా ఇంటి వద్దనే ఉంటున్న ధర్మయ్య శుక్రవారం తీవ్ర ఎండవేడిమి, వడగాలుల ప్రభావంతో ఒక్కసారిగా అస్వస్థతకు గురై వాంతులు చేసుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక వైద్యులను సంప్రదించగా ప్రాథమిక చికిత్స అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో శనివారం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంట్లో మంచంపై అపస్మారక స్థితిలో కనిపించడంతో వెంటనే స్థానిక వైద్యుడిని పిలిపించి పరీక్షించగా అప్పటికే ధర్మయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ధర్మయ్య మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కుటుంబ పోషణ భారం ఆయనపైనే ఉండటంతో ప్రస్తుతం కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడిందని బంధువులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మృతుని కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
వరంగల్, ఆదివారం, 31-05-2026

# మండుటెండల్లో 'ఉపాధి' పనులు

- మండుటెండల్లో పనిచేస్తున్న కూలీలు
- కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం
- నిబంధనల ప్రకారం ఉండాల్సిన టెంట్లు, మెడికల్ కిట్లు గల్లంతు
- రోజుకు రెండుసార్లు ఫొటో క్యాప్చరింగ్‌తో పనులకు అంతరాయం
- పట్టించుకోని అధికారుల తీరుపై కార్మికుల ఆగ్రహం
- తక్షణమే తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని కూలీల డిమాండ్



**గార్ల, మే 30 (ప్రభాత గమనం) :**

ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు ఉపాధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం గార్ల మండలంలో నీరుగారుతున్నట్లు కనిపిస్తోంది. మండుటెండల్లో పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండగా, అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, నీడ, వైద్య సదుపాయాలు లేకపోవడంతో ఉపాధి హామీ పనులు కూలీలకు ఉపాధికంటే అవస్థలనే మిగులుస్తున్నాయని వాపోతున్నారు.

### ఎండ తీవ్రతతో అల్లాడుతున్న కూలీలు

గార్ల మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలు మండుటెండల్లో పనిచేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ, పనుల ప్రదేశాల్లో కనీస రక్షణ చర్యలు కనిపించడం లేదని కార్మికులు చెబుతున్నారు.

### నిబంధనలు కాగితాలకే పరిమితం

ఉపాధి హామీ పనుల వద్ద తప్పనిసరిగా ఉండాల్సిన తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు వంటి సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని కూలీలు ఆరోపిస్తున్నారు.

### ఫొటో క్యాప్చరింగ్‌తో కొత్త కష్టాలు

సాంకేతిక నిబంధనల పేరుతో రోజుకు రెండుసార్లు ఫొటోలు తీసే ప్రక్రియ కూలీలకు భారంగా మారింది. ఫొటోల కోసం వేచి ఉండాల్సి రావడంతో పని సమయం వృథా అవుతోందని, ఎండలోనే గంటల తరబడి నిలబడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని పనుల ప్రదేశాల్లో టెంట్లు, స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని, కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని స్థానికులు, కార్మికులు కోరుతున్నారు.



# రైతులకు నాణ్యమైన విత్తనాలే లక్ష్యం

- కల్తీ విత్తనాలకు చెక్.. అధిక దిగుబడులపై దృష్టి
- డీలర్లు ప్రభుత్వం సూచించిన రకాల విత్తనాలనే విక్రయించాలి
- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

**హన్మకొండ, ప్రభాత గమనం :**

రైతులు కల్తీ విత్తనాల బారిన పడి నష్టపోకుండా, నమ్మకమైన మరియు అధిక దిగుబడులు ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల ఆదాయం పెరగాలంటే వరి సాగుతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల విత్తన డీలర్లు, సహకార సంఘాలు, ఏఆర్ఎస్‌కే కేంద్రాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో అన్వేష్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు కల్తీ విత్తనాల వల్ల నష్టపోతున్న నేపథ్యంలో నాణ్యమైన విత్తనాల వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

### ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం

ఇరు జిల్లాల్లో ప్రధానంగా వరి సాగు జరుగుతోందని, రైతులకు మెరుగైన ఆదాయం అందాలంటే పెసర, కంది, మినుము, శనగ, వేరుశనగ, నువ్వులు వంటి పంటల సాగు వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని సూచించారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై విత్తన ఉత్పత్తి చేపడుతోందని, సేకరించిన విత్తనాలను కఠినమైన ప్రమాణ పరీక్షల అనంతరం మాత్రమే ధృవీకరించి రైతులకు అందిస్తున్నామని తెలిపారు.

### ఖరీఫ్‌కు విత్తనాల కొరత లేదు

ప్రస్తుత వానాకాలం సీజన్‌కు జిల్లాల్లో విత్తనాల కొరత లేదని స్పష్టం చేశారు. బీపీటీ–5204, ఆర్ఎన్ఆర్–15048, కెఎన్ఎం–1638 వంటి సన్నరకాలు, కెఎన్ఎం–118, ఎమ్‌టియు–1010 వంటి దొడ్డు రకాల విత్తనాలు సమృద్ధిగా నిల్వ ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం సూచించిన రకాలనే డీలర్లు విక్రయించాలని సూచించారు.

### 66 వేల క్వింటాళ్ల విత్తనాల అవసరం

ఖరీఫ్ సీజన్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో సుమారు 2.68 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఇందుకు 66 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని, అందులో కనీసం 30 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

### డీలర్ల హక్కులకూ రక్షణ

రాబోయే నూతన విత్తన చట్టం రైతుల హక్కులతో పాటు విత్తన డీలర్ల ప్రయోజనాలను కూడా పరిరక్షిస్తుందని అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. సహకార సంఘాలు, ఏఆర్ఎస్‌కే కేంద్రాలు పచ్చిరొట్ట విత్తనాలతో పాటు ఇతర పంటల విత్తనాల సరఫరాలోనూ చొరవ చూపాలని సూచించారు.

# కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై రైతుల ఆగ్రహం..


- మద్దివంచలో మద్దతు ధరల జీవో కాపీల దహనం!

**గార్ల, మే 30 (ప్రభాత గమనం ) :**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధరలపై రైతాంగం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే శనివారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో రైతులు వినూత్నంగా తమ నిరసనను తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మద్దతు ధరల జీవో కాపీలను ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతులు బహిరంగంగా దహనం చేశారు.ఈ నిరసన కార్యక్రమానికి హాజరైన రైతు సంఘం నాయకులు రంగారావు, మల్లేష్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని నమ్మబలికిన కేంద్రం, తీరా ఇప్పుడు అమలు చేసే సమయానికి మాట తప్పిందని ఆరోపించారు.ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన అరకొర మద్దతు ధరలు పెట్టుబడి ఖర్చులకు కూడా సరిపోవని, ఇవి రైతులను పూర్తిగా మోసం చేయడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతును కేంద్ర ప్రభుత్వం నట్టేట ముంచుతోందని, ఈ ధరలు రైతులకు ఏమాత్రం ఉపయోగపడవని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైతులకు అనుకూలంగా నినాదాలు చేస్తూ ఎర్రజెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి, రైతులకు మేలు జరిగేలా గిట్టుబాటు ధరలను సవరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.



## జూన్ 6న ఇంటర్ కాలేజీలు పునః ప్రారంభం..



**హైదరాబాద్, మే30 (ప్రభాత గమనం):**

ఇంటర్ కాలేజీల పునఃప్రారంభాన్ని ఇంటర్ విద్యామండలి వాయిదా వేసింది. సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే నెల జూన్ 5 వరకు ఉన్నందున 6న కాలేజీలు పునఃప్రారంభమవుతాయని బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓవైపు కొన్ని కాలేజీల్లో పరీక్షా కేంద్రాలు ఉండటం, సిబ్బందికి పరీక్షల విధుల కేటాయించిన నేపథ్యంలో పునఃప్రారంభ తేదీని మార్చినట్లు తెలిపారు.

# పిల్లల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలి

- ప్రజా పాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల పార్లమెంట్ నిర్వహణ



**హనుమకొండ, మే 30, ప్రభాత గమనం :**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం హనుమకొండలోని ఐడీఓసీ సముదాయంలో స్నేహ బాలికల పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని 12 మండలాల నుండి స్నేహ బాలికలు, ఉత్తమ ఉల్లాస్ అభ్యాసకురాలు, ఉత్తమ ఉల్లాస్ స్వచ్ఛంద కార్యకర్త, మహిళా సంఘాల అధ్యక్షులు మరియు సంబంధిత సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాలల పార్లమెంట్‌లో స్నేహ సంఘాల పురోగతి, ప్రస్తుత పరిస్థితులు, బాలల భద్రత మరియు రక్షణ, పాఠశాలలు మరియు గ్రామాల భద్రత, విద్య, పారిశుధ్యం – ఆరోగ్యం – రవాణా, సాధికారత తదితర అంశాలపై బాలికలు చర్చించి తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. పిల్లలు తమ గ్రామాలు, పాఠశాలలు మరియు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడంతో పాటు వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. బాలల హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి మరియు సురక్షిత వాతావరణం కల్పించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, వయోజన విద్య ఉప సంచాలకులు, పోలీసు శాఖ అధికారులు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు. అధికారులు బాలికలు ప్రస్తావించిన అంశాలను శ్రద్ధగా విని, వారి అవసరాలను పరిగణనలోకి తీసుకొని తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సమాజ అభివృద్ధిలో బాలల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ కార్యక్రమంలో పాల్గొన్న బాలికలను అభినందించారు.

# సీపీఎంలో 'బాల'రిష్టాలు

- 35 ఏళ్ల నిబద్ధతకు స్థానిక నేతల 'పోకడల' గ్రహణం!
- పార్టీకి గుడ్ బై చెప్పిన సీనియర్ గిరిజన నాయకుడు కేలోత్ బాల

**గార్ల, మే 30 (ప్రభాత గమనం) :**



గార్ల మండల సిపిఎం (CPM) పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బట్టబయలయ్యాయి. గత ముప్పై ఐదు సంవత్సరాలుగా పార్టీ సిద్ధాంతాలను భుజాన మోస్తూ, ప్రజా క్షేత్రంలో అలుపెరగని పోరాటం చేసిన సీనియర్ గిరిజన నాయకుడు కేలోత్ బాల పార్టీకి గుడ్‌బై చెప్పడం ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో దావానలంగా మారింది. పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఆయన.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ అధిష్టానానికి లేఖ పంపడం గార్ల కమ్యూనిస్ట్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.ఈ రాజీనామా వెనుక కేవలం అసంతృప్తి మాత్రమే లేదు, స్థానిక నాయకత్వంపై తీవ్రస్థాయిలో తిరుగుబాటు కనిపిస్తోంది. రాజీనామా సందర్భంగా కేలోత్ బాల చేసిన వ్యాఖ్యలు పార్టీలోని అంతర్గత కుమ్ములాటలను, సీనియర్లను పక్కన పెట్టే ధోరణిని స్పష్టం చేస్తున్నాయి. గత కొంతకాలంగా స్థానిక నేతల ప్రవర్తన, వారి ఒంటెద్దు పోకడలు శృతిమించాయని, వాటిని భరించలేకనే తీవ్ర మనస్తాపంతో తాను ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేశారు."పార్టీ కోసం రక్తం చెమటా చిందించిన పాత తరం కార్యకర్తలకు, నిత్యం ప్రజల్లో ఉండే నాయకులకు ఇప్పుడు సిపిఎంలో గుర్తింపు కరువైంది. స్థానిక నాయకత్వ పోకడలు నచ్చకే తీవ్ర మనస్తాపంతో పార్టీ వీడాల్సి వస్తోంది."ముప్పై ఐదేళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ప్రజా సమస్యలపై పోరాడిన ఒక క్షేత్రస్థాయి గిరిజన నేత ఇలా అర్ధాంతరంగా వైదొలగడం వెనుక.. స్థానిక లీడర్ల 'అహంకారం' ఉందనే ప్రచారం జోరందుకుంది. నిబద్ధత గల సీనియర్ల కంటే, సొంత ఎజెండాతో నడిచే వారికే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలకు బాల రాజీనామా మరింత బలాన్ని చేకూర్చింది. సరిగ్గా రాజకీయాలు వేడెక్కుతున్న తరుణంలో, ఒక కీలకమైన గిరిజన ముఖచిత్రం పార్టీకి దూరం కావడం గార్ల మండలంలో సిపిఎం ఉనికిని ఏ మేరకు దెబ్బతీస్తుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ అంతర్గత సంక్షోభంపై పార్టీ అధిష్టానం ఎలా స్పందిస్తుందో, నష్టనివారణ చర్యలు ఏం చేపడుతుందో వేచి చూడాలి.




# ఘనంగా సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై సమైక్య పోరాటాలకు పిలుపు
- ఎర్రజెండాను ఆవిష్కరించిన రాష్ట్ర నాయకులు బండ్ల అప్పిరెడ్డి

**గార్ల, మే 30 (ప్రభాత గమనం) :**

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం మండల కేంద్రంలో కార్మికులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు బండ్ల అప్పిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి, సంఘం జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలో కార్మిక సమస్యల పరిష్కారానికి, హక్కుల రక్షణకు మరియు కనీస వేతన చట్టం అమలు కోసం 1970 మే 30న పశ్చిమ బెంగాల్ వేదికగా సీఐటీయూ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన నిలబడి నిరంతరం రాజీలేని పోరాటాలు సాగిస్తున్న ఏకైక సంఘం సీఐటీయూ అని ఆయన కొనియాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కాలరాస్తూ, వాటిని కేవలం నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించడం దుర్మార్ balanced మన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ, కార్మికుల హక్కులను హరించే ఇలాంటి చట్టాలకు వ్యతిరేకంగా కార్మికలోకమంతా ఏకమై సమైక్య పోరాటాలు నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ వేడుకల్లో కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పి.దాసు, కిరణ్, శేఖర్, నరేష్, శ్రీనివాస్, రామ్ చరణ్, ప్రేమ్ చంద్, వేణుగోపాల్, రాజశేఖర్, ప్రభాకర్, అరవింద్, కొండమ్మ, సుమతి, రాజేష్, దుర్గ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఈసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకర్ వరుణ్ సందేశ్‌కు ఘన సన్మానం

**గార్ల, మే 30 (ప్రభాత గమనం):**

ఈసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించి మండల కీర్తిని చాటిన గార్ల వరుణ్ సందేశ్‌ను శనివారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఘనంగా సన్మానించారు. గార్ల మేజర్ సర్పంచ్ బానోతు పార్వతి హాథీరాం నాయక్ ఆధ్వర్యంలో ప్రముఖులు, అధికారులు, యువతీ యువకులు కలిసి ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.మండలానికి చెందిన ప్రముఖ ఆర్ఎంపీ డాక్టర్ కోట శ్రీనివాసరావు కుమారుడైన వరుణ్ సందేశ్, ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించినప్పటికీ చదువుపై ఉన్న ఆసక్తి, పట్టుదలతో ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పార్వతి హాతిరామ్ నాయక్ మాట్లాడుతూ.. "వరుణ్ సందేశ్ సాధించిన ఈ విజయం గార్ల మండలానికే ఎంతో గర్వకారణం. ఎందరో గ్రామీణ విద్యార్థులకు ఇతడు ఆదర్శంగా నిలిచాడు" అని అభినందించారు.సన్మాన సభలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ, వరుణ్ సందేశ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉంటూ ప్రజలను చైతన్యపరచాలని, ఉన్నత విద్యావంతుడిగా సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వరుణ్ సందేశ్‌తో పాటు ఆయన తండ్రి శ్రీనివాసరావును శాలువాలతో సత్కరించి, స్వీట్లు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో గార్ల పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, అలాగే స్థానిక ప్రముఖులు తోడేటి శ్రీనివాస్, గార్ల మండల పుర హాతిరామ్ నాయక్, సోను జైన్, పరుచూరి చిన్ని, ఉపేందర్ రెడ్డి, చారి, కంచర్ల సుధాకర్, కృష్ణ, పెడమర్తి రమేష్ మరియు పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. కాగా, వరుణ్ సందేశ్ సాధించిన విజయానికి గాను పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి చేరుకుని, మరి కొందరు ఫోన్ల ద్వారా అభినందనల వర్షం కురిపించారు.



# మహబూబాబాద్‌లో అర్ధరాత్రి 'బుల్లెట్' హల్‌చల్

- సివిల్ డ్రస్ లో ఎస్పీ శబరీష్ ఆకస్మిక తనిఖీలు!
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న సరికొత్త యాక్షన్ ప్లాన్
- గంజాయి, మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం
- యువత తప్పు చేస్తే కౌన్సిలింగ్.. నేరం రుజువైతే కఠిన శిక్షలు
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ శబరీష్ పిలుపు

**మహబూబాబాద్, మే 30 (ప్రభాత గమనం) :**

మహబూబాబాద్ జిల్లాలో అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైంది. ఇకపై జిల్లాలో చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారి ఆటలు సాగవని, 'ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరో లెక్క' అని జిల్లా పోలీస్ బాస్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సరికొత్త పంథాతో రంగంలోకి దిగారు. అర్ధరాత్రి వేళల్లో స్వయంగా ఆయనే బుల్లెట్ బైక్‌పై, సివిల్ డ్రస్‌లో సామాన్యుడిలా అనుమానాస్పద ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అక్రమార్కులకు నిద్ర లేకుండా చేస్తున్నారు.మహబూబాబాద్ జిల్లాను గంజాయి మరియు మత్తు పదార్థాలు లేని జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం కదిలింది. మత్తుమందులు, గంజాయి వాడినా లేదా రవాణా చేసినా ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని ఎస్పీ డాక్టర్ శబరీష్ ఘాటుగా హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా ఉంటుందని, అనుమానితులకు అక్కడికక్కడే డ్రగ్ టెస్టులు (పరీక్షలు) నిర్వహిస్తామని స్పష్టం చేశారు. నేరం రుజువైతే చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని తేల్చి చెప్పారు.తెలిసి తెలియక తప్పుదోవ పడుతున్న యువత భవిష్యత్తు నాశనం కాకుండా ఉండేందుకు, వారిని సరైన మార్గంలో పెట్టేందుకు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని ఎస్పీ మానవీయ కోణాన్ని ప్రదర్శించారు.ఇదే సమయంలో పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. "మీ బిడ్డలు ఎవరితో తిరుగుతున్నారు? ఎప్పుడు ఇంటికి వస్తున్నారు? వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు ఉన్నాయా? అనే విషయాలను గమనించాలి. తేడా కనిపిస్తే తేలికగా తీసుకోకుండా మీ ఇల్లే ఒక మార్పునకు పునాది కావాలి" అని ఆయన పిలుపునిచ్చారు.మహబూబాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజలకు ప్రతిక్షణం అందుబాటులో ఉంటుందని ఎస్పీ తెలిపారు. జిల్లాలో గంజాయి విక్రయాలు లేదా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా వెంటనే పోలీస్ హెల్ప్ లైన్ నంబర్: 8712656999 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు."మనందరం కలిసి కదిలితేనే మహబూబాబాద్‌ను గంజాయి రహిత జిల్లాగా మార్చగలం" అని జిల్లా ప్రజలకు ఎస్పీ డాక్టర్ శబరీష్ పిలుపునిచ్చారు.



# టీఆర్పీలోకి భారీగా చేరికలు

- నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల అధ్యక్షుడిగా కొండేటి రవి

**నిర్మల్ జిల్లా మే30(ప్రభాత గమనం):**

జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతం దిశగా కీలక అడుగులు వేస్తోంది. లోకేశ్వరం మండలం కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు గైని సాయి మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చేరిన నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ విస్తరణలో భాగంగా కొండేటి రవి ని లోకేశ్వరం మండల అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా కమిటీ అధికారికంగా ప్రకటించింది. ఆయనకు పార్టీ బాధ్యతలను అప్పగించి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గైని సాయి మోహన్ మాట్లాడుతూ..తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆశయాలు, ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై జిల్లాలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని గ్రామ గ్రామాన విస్తరించి మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెడ్లోడ్ శంకర్ గారి తో పాటు ఉప సర్పంచ్ దేవేందర్, వార్డు సభ్యుడు సతీష్ రెడ్డి, రాజు, చిన్నయ్య, నర్సారెడ్డి, శ్రీనివాస్, దేవన్న, సాయన్న, రత్నయ్య, గంగా రెడ్డి, చరణ్, భూమన్న తదితరులు పాల్గొన్నారు. ఈ భారీ చేరికలు మరియు నూతన నియామకాలతో నిర్మల్ జిల్లా, ముఖ్యంగా లోకేశ్వరం మండలంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొన్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

# బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అరెస్ట్

**హైదరాబాద్, మే30 (ప్రభాత గమనం):**



ఇటీవల జరిగిన ఓ సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బాల్కసుమన్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 3 రోజుల క్రితం సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో శనివారం ఉదయం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పోలీసులు బాల్క సుమన్ ను హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. ఇటీవల సింగరేణి జీఎం కార్యాలయాన్ని తగలబెట్టాలంటూ బాల్క సుమన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు., ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు మిలిటెంట్ తరహాలో ఉధృత పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలనే ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు ఉన్నాయంటూ నమోదైన కేసుల ఆధారంగానే పోలీసులు శనివారం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాల్క సుమన్ అరెస్ట్ వార్తతో నాంపల్లి కోర్టు పరిసరాల్లో పోలీసుల బందోబస్తును భారీగా పెంచారు.మరోవైపు తన అరెస్ట్ వార్తలను మాత్రం బాల్క సుమన్ ఖండించారు. తాను తెలంగాణ భవన్‌లోనే ఉన్నానని, అరెస్టు చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటానని తెలిపారు.



# నాకు మంత్రి పదవి కావాలి

- రాహుల్ గాంధీతో స్పీకర్ గడ్డం ప్రసాద్ భేటీ
- రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ

**హైదరాబాద్, మే30(ప్రభాత గమనం):**

జూన్ నెలాఖరులో మంత్రివర్గ ప్రక్షాళన, విస్తరణ ఉంటాయన్న వార్తతో ఢిల్లీ బాట పట్టిన మంత్రి పదవి ఆశావాహులు.అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ రాహుల్ గాంధీతో భేటీ కావడంతో రాజకీయ వర్గాలు జోరుగా చర్చలు. తనకు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో చోటు కల్పించాలని రాహుల్ గాంధీని కోరినట్లు తెలిపిన కాంగ్రెస్ వర్గాలు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో తనను బలి పశువును చేసి, తనకు అపకీర్తి కలిగించేలా చేశారని, స్పీకర్ గడ్డం ప్రసాద్ మంత్రి పదవి వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

# ఘనంగా సీఐటీయూ 57వ ఆవిర్భావ దినోత్సవం

- కేసముద్రంలో ఘనంగా ఎర్రజెండా ఆవిష్కరణ
- కార్మికుల కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి :సీఐటీయూ మండల కార్యదర్శి జల్లే జయరాజు
- నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్

**కేసముద్రం, మే 30 (ప్రభాత గమనం) :**

మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో శనివారం సిఐటియు 57వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు సంఘం యొక్క అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1970 మే 30న ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు సిఐటియు దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు చేస్తోందని కొనియాడారు. సబ్బండ వర్గాల హక్కుల రక్షణలో, వారి సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని స్పష్టం చేశారు.దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించే నాయకులు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని జయరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనంగా నెలకు రూ. 26,000 ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఆదేశించినప్పటికీ, పాలకులు ఆ మాటలను పెడచెవిన పెట్టడం దుర్మార్గమన్నారు. కార్మిక వర్గానికి తీవ్ర నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేస్తూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తక్షణమే తీర్మానం చేయాలని కోరారు.రాబోయే రోజుల్లో కార్మికుల హక్కుల రక్షణ కోసం, వేతనాల పెంపుకై మరియు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి ఉంటుందని, అందుకు కార్మిక లోకం సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మున్సిపాలిటీ యూనియన్ అధ్యక్షులు జాటోతు మంగీలాల్, కార్యదర్శి టేకుల శ్రీనివాస్, చుంచు కొమురయ్య, కొమ్ము భాస్కర్, కొంగర కవిత, మురపాక సత్తమ్మ, దుర్గం మరియమ్మ, తేళ్ల సంజీవ, జాటోతి వీరన్న, తోట శ్రీను, తేళ్ల సుజాత, మోరపాక యాకమ్మ, లింగాడపు యాకయ్య తదితర కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు దండు శ్రీనివాస్ కు ఆహ్వానం

**కేసముద్రం, మే30(ప్రభాత గమనం):**



కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం గ్రామానికి చెందిన వర్ధమాన కవి దండు శ్రీనివాస్ కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని రాజమహేంద్రవరం (రాజమండ్రి )లో జూన్ నెల 6 మరియు 7వ తేది లలో జరగబోయే ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు ఆహ్వానం వచ్చిందని శనివారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా కవి దండు శ్రీనివాస్ మాట్లాడుతూ..రాజమండ్రి లో జరిగే ప్రపంచ వేదిక లో వివిధ దేశాల నుండి కవులు, సాహిత్య విశ్లేషకులు, తెలుగు సాహిత్యం అవసోపానం పట్టిన దిగ్గజ కవులు,గజల్ కళాకారులూ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అలాంటి వేదిక పై నాకు అవకాశం రావడం సంతోషం గా వుందని అన్నారు.ఇంతటి గొప్ప సువర్ణ అవకాశం కల్పించిన శ్రీ. శ్రీ. కళావేదిక నిర్వాహకులకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.



# ఎల్లుండి నుంచి వారి సిలిండర్ కనెక్షన్లు కట్..!

**హైదరాబాద్, మే30 (ప్రభాత గమనం):**

దేశంలో ఎల్పిజీ కొరత రాకుండా కేంద్రం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఒక ఇంటికి ఒకే కనెక్షన్ రూల్ తీసుకొచ్చింది. పిఎన్జీ సప్లై ఉన్నవాళ్లు ఎల్పిజీ కనెక్షన్ను వదులుకోవాలని ఇప్పటికే కోరింది. అయితే జూన్ 1 నుంచి అలాంటి వారికి ఆటోమేటిక్ గా ఎల్పిజీ కనెక్షన్ కట్ కానుంది. వీరు సిలిండర్ రీఫిల్లింగ్ కోసం బుక్ చేసుకోలేరు. ఈమేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీలు తమ డిజిటల్ డేటాబేస్ను అనుసంధానించాయి.

# బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం..

- మహిళల భద్రత కోసమే 'జెండర్ రిసోర్స్ కేంద్రం'
- ఉచిత కుటుంబ సలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- కేసముద్రం ఎంపీడీవో

**కేసముద్రం, మే 30:(ప్రభాత గమనం) :**



బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, మహిళల భద్రత, రక్షణ కోసమే 'జెండర్ రిసోర్స్ కేంద్రాన్ని' ఏర్పాటు చేసిందని కేసముద్రం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పేర్కొన్నారు. మహిళా సాధికారత సాధించేందుకు సమాజమంతా సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.శనివారం కేసముద్రం మండల కేంద్రంలోని సాధికారత మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో, కమ్యూనిటీ నిర్వహణలో ఏర్పాటు చేసిన "ఉచిత కుటుంబ సలహా కేంద్రం", "జెండర్ రిసోర్స్ సెంటర్"ను ఏపీఎం కృష్ణమూర్తితో కలిసి ఎంపీడీవో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ.. మహిళల భద్రతకు, వారిపై జరిగే హింస నిర్మూలనకు సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా కలిసి పనిచేయాలన్నారు. సమాజంలో ఇంకా పేరుకుని ఉన్న బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, జోగిని వ్యవస్థ వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు ఈ జెండర్ రీసెర్చ్ సెంటర్ ఒక అద్భుతమైన వేదికగా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు ఎక్కడా అసమానతలకు గురికాకుండా న్యాయం చేసేందుకు ఇలాంటి కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు."ప్రస్తుత కాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించిపోతున్న తరుణంలో, కుటుంబాల మధ్య సఖ్యత కోసం ప్రభుత్వం ఇలాంటి ఉచిత కౌన్సిలింగ్, రిసోర్స్ కేంద్రాలను ప్రారంభించడం చాలా శుభపరిణామని తెలిపారు."జెండర్ కేంద్రంలో పనిచేసే కమిటీ సభ్యులు ఎంతో ఓపికతో, ఎలాంటి పక్షపాతం లేకుండా బాధితులకు కౌన్సిలింగ్ ఇచ్చి మహిళలకు న్యాయం చేయాలని ఎంపీడీవో సూచించారు. ఆడపిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని, బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా సామాజిక ఎజెండాలో భాగంగా.. గృహహింస నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ రూపుమాపడం, మద్యపాన నియంత్రణ, మానవ అక్రమ రవాణా నివారణ, మూఢనమ్మకాల నిర్మూలనపై అక్కడికి వచ్చిన వారికి ప్రత్యేక అవగాహన కల్పించారు. అనంతరం, ఆడపిల్లలకు 21 ఏళ్లు వచ్చిన తర్వాతే పెళ్లిళ్లు చేస్తామని అందరితో 'జెండర్ ప్రతిజ్ఞ' చేయించారు.కార్యక్రమంలో భాగంగా 'ఉల్లాస్' పథకంలో భాగంగా అక్షరాస్యత, ఇతర సామాజిక సేవలలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన వాలంటీర్లను, అభ్యాసకులను, విద్యాశాఖ సిబ్బందిని ఎంపీడీవో, ఏపీఎంలు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, జెండర్ కమిటీ సభ్యులు, మహిళలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374